క్లుప్తంగా

రేపు మైసమ్మకు బోనాలు

కుల్కచర్ల: మక్తవెంకటాపూర్ గ్రామంలో సోమవారం బంగారు మైసమ్మకు బోనాలు నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ రాందాస్ నాయక్, ఉత్సవ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

ఆలయాల్లో శ్రావణ సందడి

బొంరాస్‌పేట: దుద్యాల మండలం చిల్మల్‌మైలారం పంచాయతీ పరిధి మామిడికుంట ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం భక్తులు సందడి చేశారు. శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా భక్తజనం ప్రత్యేక పూజలు చేశారు. కోనేరును సందర్శించి స్వామివారి శిలావిగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉపవాస దీక్షలతో మొక్కులు తీర్చుకున్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం కొత్తపల్లిలో సుంకరి రాజమణి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్.. పార్టీ మండల అధ్యక్షుడు మాసయ్య ముదిరాజ్, తదితర నేతల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5వేలు అందజేశారు. రాఘవేందర్, శివకుమార్, గోపాల్, రాఘవేందర్, శ్రీశైలం, ఆంజనేయులు, రవి, నరేష్, గోరెపాష ఉన్నారు.

ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలి

అనంతగిరి: 104 కాంట్రాక్ట్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అందజేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తుకారం డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. వేతనాల చెల్లింపులో ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా చెల్లించాలని కోరారు. జిల్లా నాయకులు శ్రీనివాస్ బాలరాజ్ వినోద్ మహేందర్ రాఘవేందర్, హరిప్రసాద్ మల్లేశం, గోవర్ధన్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న ప్రమోదిని దేవి

యాలాల: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా రాణించాలని వికారాబాద్ జెడ్పీటీసీ, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తల్లి ప్రమోదిని దేవి అన్నారు. శనివారం యాలాల మండలం పగిడియాలలో రోహితన్న మహిళ చేయూత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గత ఎన్నికల ప్రచారంలో మహిళల అభ్యున్నతికి పాటుపడతానని హామీ ఇచ్చానని, అందులో భాగంగానే కుట్టు శిక్షణతో పాటు కుట్లు, అల్లికలు, బ్యూటీ పార్లర్ శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి 40 మంది మహిళలకు నెల రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు శకుంతల, పగిడియాల, అన్నాసాగర్ సర్పంచ్‌లు బసిరెడ్డి, రత్నమ్మ, ఎంపీటీసీ రాములు, పార్టీ మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ కుమార్ ఉన్నారు.

లక్ష్మీపతికి లక్ష తులసీ దళార్చన

అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తజనం

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

పద్మావతీ సమేత శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీపతికి శనివారం లక్ష తులసీ దళాలతో అర్చన చేశారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలు, తులసీ దళాలతో దేవతా మూర్తులకు విశేష అలంకరణ చేశారు. బ్రాహ్మణులు విష్ణు సహస్ర నామావళి పటించారు. శ్రావణమాసం మూడో శనివారం కావడంతో శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, తోమాల సేవ, అలంకరణ చేశారు. విష్ణుసహస్ర నామార్చన, ప్రసాద నైవేద్యం, మహా మంగళ హారతి తదితర కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. పూజాకార్యక్రమంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా.. కర్నాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పట్టణంలోని చితారు పేరుమాళ్ల ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు స్వామివారి మూలమూర్తికి అభిషేకం చేశారు. నైవేద్యం సమర్పించారు. పురోహితులు స్వామివారికి అభిషేకం, చందన లేపనం, ఆకు పూజ చేశారు. శాంతినగర్ కాలనీలో అభయాంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు ఉదయం స్వామి వారికి అభిషేకం చేశారు.

కరుణించని వరుణుడు

- ఆలయాల్లో అన్నదాతల పూజలు
- పంటలు ఎండుతున్నాయి ఆదుకోవాలంటూ వేడుకోలు



మహాదేవుని ఆలయ ఆవరణలో భజనలు చేస్తున్న అన్నదాతలు

కొడంగల్ రూరల్: వానలు కురిసి, పంటలు సమృద్ధిగా పండేలా కురుణించవా వరుణ దేవా అంటూ అన్నదాతలు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం గాడిబాయి శివాలయంలో అర్చకులు కిట్టుస్వామి ఆధ్వర్యంలో దంపతులు మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ వాణిశ్రీ, రైతులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కిట్టుస్వామి సూచనల మేరకు రైతులు పట్టణంలోని తెలంగ్‌వాడ బొడ్రాయి, బసవేశ్వర, వేంకటేశ్వర స్వామి, నగరేశ్వర, చౌడేశ్వరీ, మహాదేవుడి, చితారు పెరుమాళ్ల ఆంజనేయస్వామి, రాఘవేంద్రస్వామి, కేశవస్వామివార్ల దేవాలయాల్లో ఆయా దేవతామూర్తులకు గంగాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామం నుంచి సిద్దనొంపు ఆంజనేయ స్వామివారి ఆలయం వరకు పాదయాత్రగా వరుణ దేవున్ని స్మరిస్తూ భజనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వర్షాలు పడకపోవడంతో పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. వరుణుడి కరుణించి వర్షాలు సమృద్ధిగా కురిపించాలని వేడుకున్నారు. ఊట్కూర్ రాజు, బైండ్ల ఆనంద్, తాటి అనంతయ్య, కుర్మయ్య, రావులపల్లి సాయప్ప, బండి వినోద్, శ్రీనివాస్, బండి బుగ్గప్ప, కొల్లూరు మల్లప్ప, నల్లగారి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు కునుకు కరువు

- నిలువునా ఎండుతున్న పంటలు
- పెట్టుబడులు కోల్పోతున్నామంటూ కన్నీటి పర్యంతం

పెద్దేముల్: ఈ ఏడాది అన్నదాతను వరుణుడు అయోమయానికి గురిచేస్తున్నాడు. నెల రోజులుగా చినుకు జాడ కానరాకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టి, కర్షకులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో మినుము, పెసరతో పాటు మొక్కజొన్న పంటలు చేతికి వచ్చేవి. కానీ వానలు కనుమరుగయ్యే సరికి చేతికి వచ్చే పంటలు చేనులోనే ఎండిపోతున్నాయి.

కష్టాల్లో కౌలు రైతులు

పెద్దేముల్ మండలం తట్టెపల్లి, జైరాంతండా (తట్టెపల్లి) పాషాపూర్, ఓంలానాయక్ తండా, ఇందూరు, ఆత్కూర్, సిద్దన్న మడుగుతండా, బండమీదిపల్లి, పెద్దేముల్ తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంటను రైతులు అధికంగా సాగుచేశారు. ఈ గ్రామాల్లో రైతుల కంటే, కౌలు రైతులే అధికంగా ఉన్నారు. నాలుగు నెలలకు చేతికి వచ్చే మినుముతో పాటు మొక్కజొన్నను పండించారు. వానలు పడక పంటలు చేలల్లోనే ఎండిపోయి కౌలు రైతులు కష్టాల్లో కూరుకుపోతున్నారు.

మండుతున్న ఎండలు

దిగుబడి రాకున్నా, కనీసం పెట్టిన పెట్టుబడులు వచ్చే నమ్మకం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుత సీజన్ ప్రారంభంలో కాలం కాస్త వెనుక బడినట్లు అనిపించినా.. జులైలో భారీ వర్షాలు కురిసి లోతట్టు ప్రాంత పంట పొలాలు పూర్తిగా నీటిలో మునిగి, అపార నష్టం మిగిల్చింది. పంటలు ఎదిగే సమయంలో చినుకురాక పంటలు పూర్తిగా మాడిపోతున్నాయి. పది రోజుల నుంచి ఎండలు మండుతుండటంతో ఉన్న పంటలు కూడా పాడై పోతున్నాయని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న, పత్తి, కంది, పసుపుతో పాటు ఇతర పంటలు ఎండుముఖం పడుతున్నాయి.



జైరాంతండాలో ఎండుముఖం పట్టిన మొక్కజొన్న పంట

నేటి ర్యాలీని విజయవంతం చేయండి

యాలాల: మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలకు ఆహ్వానం పలికేందుకు ఆదివారం ఏర్పాటు చేసిన ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ జెడ్పీటీసీ, సొసైటీ మాజీ చైర్మన్ సిద్రాల శ్రీనివాస్ కోరారు. తాండూరు పట్టణంలోని విలియం మూన్ చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్ వరకు నిర్వహించనున్న కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ధారూరులో చిరు జల్లు

కంది, పత్తికి జీవం!

ధారూరు: ధారూరు మండల పరిధి గ్రామాల్లో శనివారం రాత్రి చిరు జల్లులు పడ్డాయి. దీంతో పత్తి, కంది పంటలకు కొంతైనా లాభం చేకూరగా.. వర్షం కురిసినా ఫలితం లేదని మొక్కజొన్న రైతులు పెదవి విరిచారు. నెల రోజులుగా చుక్క వాన పడకపోవడం వలన పంట ఎదుగుదల ఆగిపోయి, పూర్తిగా ఎండిపోయాయని వాపోయారు. ఇదిలా ఉండగా.. మరణశయ్యపై ఉన్న వక్తికి గొంతులో నీరు పోసినట్లుగా కంది, పత్తి పంటలకు ఈ జల్లులు జీవం పోశాయని పలువురు ఆనందం వ్యక్తంచేశారు.

దిగొస్తున్న ధరలు

ధారూరు: ధారూరు మార్కెట్లో శనివారం అన్ని రకాల కూరగాయల ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. బెండ, దొండ, బీర, కాకర, చిక్కుడు, వంకాయ, బిన్నీస్, గోరు చిక్కుడు కిలో రూ.40కే లభ్యమయ్యాయి. కిలో టమాట వారం క్రితం వరకు రూ.200లకు పలకగా.. ప్రస్తుతం రూ.20 నుంచి రూ.30 పలకడం గమనార్హం.

పల్లెపల్లెకు 'మేరీమిట్టి మేరాదేశ్'

- అమృతవాటిక ఏర్పాటులో భాగస్వాములు కండి
- జాతీయభావాలను పెంపొందించుకోవాలి
- బీజేపీ నాయకులు



మట్టిని సేకరిస్తున్న బీజేపీ శ్రేణులు

కుల్కచర్ల: ప్రతి భారతీయుడు సగర్వంగా చెప్పుకునేలా 'మేరీమిట్టి మేరాదేశ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు మారుతికిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య పిలుపునిచ్చారు. శనివారం చౌడాపూర్ మండలం కొత్తపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు బంధయ్య ఆధ్వర్యంలో 'నేను పుట్టిన నేల.. నన్ను కన్న నాదేశం' అనే అంశాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఢిల్లీలో ఏర్పాటు చేయనున్న 'అమృత వాటిక' నిర్మాణానికి గ్రామస్తుల నుంచి చిటికెడు మట్టిని అమృతకలశం ద్వారా సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భారత్‌ను ప్రపంచ దేశాల సరసన నిలిపిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని పేర్కొన్నారు. మోదీ సూచనల మేరకు మరో మహోత్తర కార్యక్రమమైన మేరిమిట్టి మేరిదేశ్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువచ్చి, అమృతవాటిక ఏర్పాటులో సకల జనుల భాగస్వామ్యం అయ్యేందుకు కృషి చేస్తున్నట్లు వారు వెల్లడించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన త్యాగధనుల స్మారకంగా రూపుదిద్దుకోనున్న అమృతవాటిక నిర్మాణంలో పార్టీలకతీతంగా ప్రజలు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీమోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు మాసయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, స్థానిక నాయకులు చరణ్, భరత్, సునిల్, క్షత్రియ పాండు, రఘు, శ్రీకాంత్, రాహుల్, రమేష్, అనిల్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి వైఎస్సార్

నిరంతరం ప్రజాసంక్షేమానికి పాటుపడిన మహానేత, రైతు బాంధవుడు వైఎస్సార్ అని పలువురు వక్తలు అన్నారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి, డాక్టర్ యెడుగూరి సందింటి రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు అభిమానులు, కాంగ్రెస్, వైఎస్సార్‌టీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. మానవత్వం మూర్తీభవించిన నేతగా, ప్రజల మనిషిగా తెలుగువారి గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచారని, పేదల పాలిట ఆయన దేవుడని కొనియాడారు.

\- సాక్షి, నెట్‌వర్క్



పెద్దేముల్: తట్టెపల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్ తదితరులు



పరిగిలో.. వైఎస్‌ఆర్‌టీపీ నేతలు



కొడంగల్ రూరల్: అంబేద్కర్ కూడలిలో..



బంట్వారంలో.. వైఎస్‌ఆర్ వీరాభిమాని సుజాత

సర్కారు బడికి చేయూత



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సంస్థ నిర్వాహకులు

కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు

- వాటర్ ప్యూరీఫయర్ అందజేత

కుల్కచర్ల: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉపయోగకరమైన పరికరాలను స్వచ్ఛంద సంస్థ అందజేయడం అభినందనీయమని మరికల్ సర్పంచ్ పాండురంగయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి అన్నారు. శనివారం చౌడాపూర్ మండలం మరికల్ జెడ్పీ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం వైటెక్ సిస్టం ఆఫ్ ఆసియా హైదరాబాద్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.6లక్షలతో కంప్యూటర్ ల్యాబ్, రూ.1.50లక్షలతో ప్యూరీఫయర్, రూ.30వేలతో టీవీని బహూకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడారు. గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో విద్యనభ్యసించే చిన్నారుల కోసం సంస్థ సహకరించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ విజయకుమార్, సత్యకుమార్, సంస్థ సభ్యులు సంజీవ్, శ్రీనివాస్ జొన్నల, స్పందన, సాయి, వాణి, రేశ్మ తదితరులు పాల్గొన్నారు.

169 మంది టీచర్ల బదిలీ తప్పనిసరి

ఎంఈఓ వెంకటయ్య



తాండూరు రూరల్: తాండూరు మండలంలో 169 మంది ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ అవుతారని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పాఠశాలల్లో పని చేస్తున్న లాంగ్‌స్టాండింగ్ ఉపాధ్యాయ జాబితాను తయారు చేశామని, వీరిని ప్రభుత్వం బదిలీ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. మిగతా ఉపాధ్యాయులు కూడా ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఉందన్నారు. మండలంలో ఎస్.ఏ, ఎస్జీటీ, హిందీ పండిట్ కలిపి మొత్తం 58 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎంఈఓ వెల్లడించారు.

రోడ్డుపై మురుగు



రామయ్యగూడ రోడ్డులో రోడ్డుపై పారుతున్న వ్యర్థ జలాలు

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని రామయ్యగూడలో కొంత కాలంగా మురుగు కాలువ నిండి, రోడ్డుపై పారుతోంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రెండు నెలల క్రితం స్థానికులు మున్సిపల్ అధికారులకు నేరుగా ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. కమిషనర్ స్థాయి అధికారులు కేవలం కార్యాలయానికే పరిమితం కావడంతో కింది స్థాయి సిబ్బంది పనిచేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువ పారుదలకు తగిన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటు హక్కు బలమైన ఆయుధం

- దేశాభివృద్ధికి యువతే కీలకం
- అర్హులందరూ ఓటు హక్కు పొందాలి
- ఆర్డీఓ విజయకుమారి



కుల్కచర్లలో అవగాహన ర్యాలీ..

పరిగి: సమాజంలో ఓటు ఒక బలమైన ఆయుధమని వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఓ కళాశాలలో ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. దేశం అభివృద్ధి చెందాలంటే యువతే కీలకమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటుతో దేశాన్ని పాలించే నాయకున్ని ఎన్నుకోవచ్చునని ఆమె చెప్పారు. కార్యక్రమంలో డీటీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినియోగించుకోండి

కుల్కచర్ల: అర్హులు ఓటుహక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ సౌమ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ఓటుహక్కు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కుకు అర్జీ పెట్టుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత ఇవ్వకపోతే భూస్థాపితమే..

- ఓటు బ్యాంకుగా చూస్తున్న రాజకీయ పార్టీలు
- 60 లక్షల ఓట్లున్నా.. ఒక్కసీటు ఇవ్వని బీఆర్‌ఎస్
- డిమాండ్ల సాధనకు కలిసి రావాలి: ముదిరాజ్ నేతల పిలుపు



పరిగి: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు

పరిగి: రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, ప్రాధాన్యత చూపని పార్టీలను భూస్థాపితం చేస్తామని ఆ సంఘం నాయకులు హెచ్చరించారు. శనివారం నిర్వహించిన చైతన్య యాత్రలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఒక్క సీటు కూడా ముదిరాజ్‌లకు కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్రంలో 60లక్షల ముదిరాజ్ ఓట్లు ఉన్నా.. ఏ ఒక్క రాజకీయ పార్టీ ప్రాధాన్యత చూపడం లేదని మండిపడ్డారు. రాజకీయ పరంగా జరుగుతున్న అన్యాయాన్ని నిలదీసేందుకు ముదిరాజ్‌లు ఏకం కావాలన్నారు. ముదిరాజ్‌లకు రావాల్సిన హక్కులను సాధించుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 15శాతం ఉన్న ముదిరాజ్‌లకు 18 ఎమ్మెల్యే సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల ఐక్యత కోసం అక్టోబర్ 1న నగరంలో నిర్వహించే అలైబలై కార్యక్రమంలో ముదిరాజ్‌లు పాల్గొనాలని కోరారు. అనంతరం 'ముదిరాజ్‌ల అలైబలై' కార్యక్రమం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించచారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవకాశం కల్పించాలి

కొడంగల్: ముదిరాజ్ కులస్తులకు రాజకీయంగా అవకాశం కల్పించాలని ఆ సంఘం నాయకులు కోరారు. ముదిరాజు చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్ర శనివారం కొడంగల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో సంఘం నాయకులు స్వాగతం పలికారు. అనంతరం పలువురు మాట్లాడారు. ముదిరాజులకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలన్నారు. కార్యక్రమంలో చైతన్య వేదిక సభ్యులు పుష్పలత, శివ, కురుమూర్తి, బాల్‌రాజ్, బోయిని వెంకటయ్య, కూర వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

మెగా డీఎస్సీ నిర్వహించాలి: కాంగ్రెస్



కొడంగల్: దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతి రెడ్డి ఆరోపించారు. మెగా డీఎస్సీని నిర్వహించాలని కోరుతూ కోస్గి మండల కేంద్రంలో నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు నిరసన దీక్ష చేపట్టారు. ఎస్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో ఉస్మానియా జేఏసీ నాయకుడు రెడ్డి శ్రీనివాస్, రఘు, నర్సింహ, నిరుద్యోగులు పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి

పరిగి: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుందని ఎన్‌ఎస్‌యూ నాయకులు ఆరోపించారు. మెగా డీఎస్సీ వేయాలని కోరుతూ ఎన్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్.. అన్ని విధాలా అందరికీ అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఇంటికో కొలువు ఇస్తామని చెప్పిన కేసీఆర్.. కనీసం ఉన్న ఖాళీలను భర్తీ చేయలేక పోతున్నారని మండిపడ్డారు. గతంలో 12వేల టీచర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పిన సర్కారు.. ఇప్పుడు సగం కూడా భర్తీ చేయకపోవటం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాడుతునే ఉంటామని చెప్పారు. నాయులు రామకృష్ణారెడ్డి, జగన్, సోయబ్, నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పెసర క్వింటాల్ రూ.10వేలు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్లో శనివారం పెసర ధర క్వింటాల్‌కు రూ.10 వేలు పలికింది. మార్కెట్‌కు 200 బస్తాల పెసర రాగా.. మొదటి రకానికి క్వింటాల్ రూ.10 వేలు, రెండో రకానికి రూ.9,300, మూడో రకానికి రూ.8,800 చొప్పున ధర పలికింది. గత వారం క్వింటాల్‌కు రూ.7 వేల నుంచి రూ.8,600 వరకే ఉండగా.. ప్రస్తుతం ఏకంగా క్వింటాల్‌కు రూ.1,400 పెరిగింది. పెసర ఉత్పత్తి అంతగా లేకపోవడం, ముందుగా చెలక నేలల్లో సాగు చేసిన పెసర మాత్రమే కొంతమేరకు చేతికి వచ్చిందని, తర్వాత వేసిన పంట వర్షాలు లేక పూర్తిగా దెబ్బతిన్నదని విచారం వ్యక్తం చేశారు.